సంపుటి :02 సంచిక :96 పేజీలు :04
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
శనివారం 31, మే 2025

ఉష్ణోగ్రతలు
కనిష్ఠం : 28
గరిష్ఠం : 35

## డెడ్ లైన్ జూన్ 6

- ఆ రోజు వరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కావాలి
- ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

03



## 8 మంది మావోలు సరెండర్

ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ వెల్లడి

02




## జూన్ 10న దేశవ్యాప్త బంద్

- 11 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల స్మారక సభలు
- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

02





కోడెల మృత్యుఘోష కానరా..

# రాజరాజేశ్వరా!

వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో మొక్కుల కోడెలు వరుసగా మృత్యువాత పడుతుండటం భక్తుల్లో ఆందోళన రేపుతున్నది. శుక్రవారం ఎనిమిది కోడెలు మృత్యువాత పడగా, శనివారం మరో ఐదు కోడెలు మృత్యువాతపడ్డాయి. దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ పట్టింపులేమితనం కోడెలకు మారణశాసనం రాస్తున్నది. రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ ప్రకియ నిలిచిపోవటం, భక్తులు అప్పగించే కోడెల సంఖ్య పెరుగుతూ వస్తుండటంతో గోశాల పరిమితి సరిపోవటం లేదు. వందల సంఖ్యలో ఉన్న కోడెల మధ్య తొక్కిసలాట జరగటం, అపారిశుధ్యం కారణంగా అనారోగ్యం పాలవటం కోడెల మృత్యువాతకు కారణాలు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి, కోడెల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, కోడెలకు వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

- వేములవాడ రాజన్న ఆలయానికి అప్రతిష్ఠ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భక్తులు
- రెండురోజుల్లో తిప్పాపూర్ గోశాలలో 13 కోడెలు మృతి
- కొన్ని గాయాలతో, మరికొన్ని అనారోగ్యంతో మృత్యువాత
- కొద్దిరోజులుగా రైతులకు నిలిచిన కోడెల పంపిణీ
- గోశాలలో పరిమితికి మించి కోడెల సంరక్షణ
- చోద్యం చూస్తున్న దేవాదాయ ధర్మాదాయశాఖ

02



## సమగ్ర కార్యాచరణతో పుష్కరాలు సక్సెస్

- డే ఆఫ్ థాంక్స్ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు
- పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్, కలెక్టర్ రాహుల్, ఎస్పీ కిరణ్

03

## ఆత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు

- కనీసం 50 ఎకరాలకు తగ్గకుండా ఉండేలా చర్యలు
- సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

03



# 8 మంది మావోలు సరెండర్

## - ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ వెల్లడి

అక్షరదర్బార్, ములుగు: ఎనిమిది మంది మావోయిస్టులు శనివారం ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఎదుట లొంగి పోయారు. వీరిలో ఒక డివి జనల్ కమిటీ సభ్యుడు, ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, ముగ్గురు పార్టీ సభ్యులు, ఇద్దరు మిలీషియా సభ్యులు ఉన్నట్లు ములుగు ఎస్పీ శబరి వెల్లడించారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను ప్రకటించారు. దోర్పెట్టి మిర్గు అలియాస్ లింగ అలియాస్ శివలాల్, మడవి టిడో అలియాస్ రామే, మిడియం భీమా, ఉయిక అనిత, మడకం కమలేష్, సోయం భీమే, మడవి మడక అలియాస్ గుడ్డు, మడవి ఇడుమ ఉన్నట్లు ఆయన తెలిపారు. డివిజనల్ కమిటీ సభ్యుడైన శివలాల్ మహారాష్ట్రలోని గడిచిరోలి జిల్లా జరపడ్డ గ్రామస్తుడని ఎస్పీ ప్రకటించారు. మిగతా ఏడుగురు మావోయిస్టులు చత్తీస్ గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాకు చెందిన వారని పేర్కొన్నారు. ములుగు జిల్లా పోలీసులు, 39 సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న 'పోరుకన్నా ఊరు మిన్న- మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయాలను తెలుసుకుని నక్సలిజాన్ని విడనాడి తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకుని వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న మావోయిస్టులు లొంగిపోతున్నట్లు జిల్లా ఎస్పీ చెప్పారు. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 355 మంది అజ్ఞాత మావోయిస్టులు లొంగిపోగా ములుగు జిల్లాలో 68 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు శబరీష్ తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసిన వారు పునరావాస సౌకర్యాలను పొందినట్లు వివరించారు.





# కోడెల మృత్యుఘోష కానరా..
# రాజరాజేశ్వరా!

- వేములవాడ రాజన్న ఆలయానికి అప్రతిష్ఠ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భక్తులు
- రెండురోజుల్లో తిప్పాపూర్ గోశాలలో 13 కోడెలు మృతి
- కొన్ని గాయాలతో, మరికొన్ని అనారోగ్యంతో మృత్యువాత
- కొద్దిరోజులుగా రైతులకు నిలిచిన కోడెల పంపిణీ
- గోశాలలో పరిమితికి మించి కోడెల సంరక్షణ
- చోద్యం చూస్తున్న దేవాదాయ ధర్మాదాయశాఖ



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో మొక్కుల కోడెలు వరుసగా మృత్యువాత పడుతుండటం భక్తుల్లో ఆందోళన రేపుతున్నది. శుక్రవారం ఎనిమిది కోడెలు మృత్యువాత పడగా, శనివారం మరో ఐదు కోడెలు మృత్యువాతపడ్డాయి. దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ పట్టింపులేమితనం కోడెలకు మారణశాసనం రాస్తున్నది. రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ ప్రకియ నిలిచిపోవటం, భక్తులు అప్పగించే కోడెల సంఖ్య పెరుగుతూ వస్తుండటంతో గోశాల పరిమితి సరిపోవటం లేదు. వందల సంఖ్యలో ఉన్న కోడెల మధ్య తొక్కిసలాట జరగటం, అపారిశుధ్యం కారణంగా అనారోగ్యం పాలవటం కోడెల మృత్యువాతకు కారణాలు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి, కోడెల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, కోడెలకు వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం ఎనిమిది కోడెలు, శనివారం మరో ఐదు కోడెలు మృత్యువాత పడటం కలకలం రేపుతున్నది. కోడెల కళేబరాలను గోశాల సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లలో తరలించి మూలవాగులో పూడ్చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. తిప్పాపూర్ గోశాలలోని 12 షెడ్లలో ప్రస్తుతం సుమారు 600 వరకు కోడెల పాలన చూసేందుకు అవకాశం ఉంది. కానీ.. కొద్దిరోజుల నుంచి రైతులకు ఉచితంగా కోడెలు అందించే కార్యక్రమం నిలిచిపోవడంతో వాటి సంఖ్య 2 వేల వరకు చేరుకున్నది. సంఖ్యకు తగినట్లు గోశాలలో వసతులు లేకపోవటం, పారిశుధ్యం పడకేయడం, ఉన్న కాస్తంత ప్రదేశంలోనే ఉంటుండటంతోనే కోడెలు అనారోగ్యానికి గురవుతున్నాయని, కొన్ని అనారోగ్యంతో అచేతనంగా పడి ఉంటే పట్టించుకోవడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. అనారోగ్యానికి చికిత్స లేకపోవడంతో కొన్ని కోడెలు మృత్యువాత పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోశాల మొత్తం బురదమయంగా మారిందని కూడా తెలుస్తున్నది. భక్తులు ఏటా చెల్లించే కోడె మొక్కుల ద్వారా ఆలయానికి రూ.కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ, కోడెల సంరక్షణను ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ గోశాలలో ఉంటున్న కోడెల సంఖ్య ఎంతన్నది.. ఆలయ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. కొందరు గోశాలలో 1,200కు పైగా కోడెలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి అక్కడ 2 వేల వరకు ఉన్నట్లు సమాచారం.

### అంతంతే గ్రాసం..

రాజన్న ఆలయానికి కోడె మొక్కుల ద్వారా ఏటా రూ.22 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. ఆలయ సన్నిధికి వచ్చే భక్తులు తప్పకుండా కోడె మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కోడెలను దేవతగా భావించి, వాటిని కొనుగోలు చేసి రాజన్న ఆలయానికి అప్పగిస్తారు. ఆలయ అధికారులు వాటిని తిప్పాపూర్ గోశాలకు తరలించి సంరక్షిస్తుంటారు. ఆలయ అధికారులు కొన్నిసార్లు ఆ కోడెలను రైతులకు అందజేస్తూ వస్తున్నారు. ఆరు నెలల క్రితం కోడెల పంపిణీలో అవకతవకలు జరగడం, ఒకే వ్యక్తికి 60 జీవాలు అందించడం సంచలనం సృష్టించింది. దీంతో రైతులకు అప్పగింత కార్యక్రమం అక్కడితో ఆగిపోయింది. దీంతో గోశాలకు భక్తులు సమర్పించే కోడెల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. గోశాలకు రోజుకు నిత్యం 400 కోడెలకు మాత్రమే పచ్చి గడ్డి మాత్రమే సమకూరుతుండగా, అక్కడున్న మొత్తం కోడెలకు ఆ గ్రాసం సరిపోవడం లేదని తెలుస్తున్నది.

### ఎన్నో ఆరోపణలు..

కోడెల సంరక్షణకు ఆలయం రెండు గోశాలలను నిర్వహిస్తోంది. గతంలో కోడెలను వేలం ద్వారా తిరిగి అమ్మే పద్ధతి ఉండేది. భక్తులు సమర్పించిన వాటిని విక్రయించడం, కొందరు కొని వాటిని కబేళాలకు తరలిస్తుండటం భక్తుల్లో ఆగ్రహావేశాలు తెచ్చింది. దీంతో దేవాదాయశాఖ వేలం ప్రక్రియను నిలిపేసింది. ఆ తర్వాత కొద్దిరోజులకు కోడెలను వ్యవసాయ పనులు చేసుకొనే రైతులకు ఉచితంగా ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైంది. కానీ దీని అమలుకు పక్కా విధానం లేకుండా పోయింది. గోశాలలు, రైతుల పేరు చెప్పి కొందరు వాటిని చేజిక్కించుకొని అమ్ముకున్న సంఘటనలూ అనేకం. ఉదాహరణకు వరంగల్ జిల్లా గీసుకొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి రైతు పేరుతో పొందిన రాజన్న మొక్కుల కోడెల్లో కొన్నింటిని అమ్ముకోగా మరికొన్ని మృత్యువాత పడిన ఘటన కొద్ది నెలల క్రితం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. దేవాదాయ శాఖ ఉద్యోగులు కూడా రైతుల నుంచి సొమ్ము తీసుకుని, రాజన్న కోడెలను అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులు తీసుకెళ్లిన కోడెల సంరక్షణపై నిఘా, పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు వాటిని కబేళాలకు అమ్మేశారనే ఘటనలు అనేకం బయటపడ్డాయి. ఇంత జరుగుతున్నా దేవాదాయ, ధర్మదాయ శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చనిపోయిన కోడెల కళేబరాలను వాహనాల్లో తరలించి, ఖననం చేయటం తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేకపోతుందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కోడెల సంరక్షణపై శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.



### స్పందించిన కలెక్టర్...

కోడెల మృత్యువాతపై సమాచారం అందుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలతో శనివారం పశువైద్యాధికారులు, సిబ్బంది గోశాలకు చేరుకుని కోడెల మృతికి గల కారణాలను గుర్తించే పనిలోపడ్డారు. అనారోగ్యంతో ఉన్న కోడెలకు చికిత్స అందిస్తున్నారు.

## మూడు నెలల రేషన్ ఒక నెలలోనే

### రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ

అక్షరదర్బార్, జనగామ: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేసే సన్న బియ్యం రేషన్ కార్డుల లబ్ధిదారులకు మూడు నెలల గ్రాసాన్ని జూన్ మాసంలోనే అందించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారిని సరస్వతి తెలిపారు. జిల్లాలో జూన్, జూలై మాసంలతో పాటు ఆగస్టు మాసం సన్న బియ్యం రేషన్ అందిస్తున్నందున రేషన్ కార్డు లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత లబ్ధిదారులు జూన్ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ లోపు సంబంధిత రెషన్ షాపుల ద్వారా రేషన్ పొందాల్సిందిగా జిల్లా సివిల్ సప్లై అధికారిణి తెలియజేశారు.

## ప్రారంభించక ముందే పడిపోయిన ట్రాన్స్ ఫార్మర్, స్తంభాలు

### కాంట్రాక్టర్ నిర్లక్ష్యం రైతులకు శాపం

అక్షరదర్బార్, చిట్యాల: వ్యవసాయ పంపు సెట్ల కోసం నిర్మించగా ప్రారంభించకుండానే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్, స్తంభాలు నేలకొరిగాయి. నిర్మాణంలో లోపాల మూలంగానే ట్రాన్స్ ఫార్మర్ కింద పడిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల చిట్యాల మండలంలోని జడల్ పేట గ్రామంలో నూతనంగా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయగా ఇటీవల కురిసిన వానాలకే అది కింద పడిపోగా తీగలు తెగి కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. నేలలో బండలు ఉన్న కారణంగా విద్యుత్ స్తంభాలను సరైన విధంగా లోతుకు నాటలేకపోవడంతో కొద్దిపాటి గాలి దుమారానికి అవి ఒరిగిపోయాయి. రెండు స్తంభాలు పూర్తిగా విరిగి కిందపడడంతో గద్దెపై ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ సైతం కిందపడి భారీ నష్టాన్ని మిగిల్చింది. ప్రమాదం జరిగి పక్షం రోజులు దాటుతున్న ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలను తీసుకోకపోవడం పట్ల రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి నిర్లక్ష్యం వహించకుండా నాణ్యతతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## జూన్ 10న దేశవ్యాప్త బంద్

- 11 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల స్మారక సభలు
- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు నంబాల కేశవరావు(బసవరాజ్) సహా 27 మంది పార్టీ కార్యకర్తలను కేంద్ర, చత్తీస్ ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేయడాన్ని ఖండిస్తూ జూన్ 10న దేశవ్యాప్తంగా బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల స్మారక సభలు జరపాలని కోరారు.

# గుండెపోటుతో బీజేపీ సీనియర్ నాయకుడు యాకాంబ్రం కన్నుమూత

## నివాళులర్పించిన బీజేపీ శ్రేణులు



అక్షర దర్బార్,తొర్రూరు : పట్టణ కేంద్రానికి చెందిన బీజేపి సీనియర్ నాయకులు పాండవుల యాకాంబ్రం గుండెపోటుతో కన్నుమూశారు. శనివారం వారి పార్థివదేహానికి బీజేపి శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ మాట్లాడుతూ... 1992లో అయోధ్యలో జరిగిన కరసేవలో తొర్రూరు నుండి పాల్గొన్న వారిలో పాండవుల యాకాంబ్రం ఒకరని, చిన్న వయస్సులోనే ఆర్ఎస్ఎస్ లో చేరి బీజేపిలో అనేక బాధ్యతలను నిర్వర్తించారని గుర్తుచేశారు. యాకాంబ్రం అకాల మరణం బీజేపి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పడిశె రాజేందర్, బీజేపి జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లె కుమార్, అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, ఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకులు అలిసేరి రవిబాబు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో ధైర్యం నింపేందుకే కవాతు

## పరకాల ఏసీపీ సతీష్ బాబు

అక్షర దర్బార్, పరకాల : ప్రజల్లో ధైర్యం నింపేందుకే రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించామని పరకాల ఏసీపీ సతీష్ బాబు అన్నారు. శనివారం సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సంయుక్తంగా పరకాల పట్టణంలోని పాత సి ఎం ఎస్ గోడౌన్స్ నుండి వయా అంబేద్కర్ కూడలి మీదుగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు పోలీస్ కవాతు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పరకాల ఎసీపీ మాట్లాడుతూ పహల్గాం ఘటన ద్వారా దేశ ప్రజల్లో అలజడి రేగినప్పటికి ఆపరేషన్ సిందూర్ ద్వారా విజయం సాధించి ఆత్మ విశ్వాసం చాటడం జరిగిందన్నారు. తాము ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఎఫ్ అధికారి సరస్వతి , పరకాల, శాయంపేట, ఆత్మకూరు సీఐలు క్రాంతి కుమార్, రంజిత్ రావు, సంతోష్, ఎస్సైలు శివకుమార్, రమేష్, పరమేశ్వర్, కొంక అశోక్, తిరుపతి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# డెడ్ లైన్ జూన్ 6

- ఆ రోజు వరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కావాలి
- ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతంగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్లు, లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, టూబీహెచ్ కే ఇళ్లు, తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్, ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి సంబంధించిన వివరాలను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి దశలో రూ.50 వేలు, రూ.లక్ష లోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను జూన్ 9 నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండల స్థాయిలో పూర్తి చేసిన తర్వాత ఆ జాబితాను సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాల్లో ప్రారంభమైన ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికను అధికారులు పూర్తి చేయాలన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తారని, లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 6 నాటికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలన్నారు. జూన్ 9 నాటికి 100శాతం నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అదనంగా బఫర్ లిస్టు సిద్ధం చేయాలన్నారు. జూన్ 6 తేదీ నాటికి పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలకు ముగ్గులు పోసి ప్రారంభించకపోతే తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులు ఏఈలు సమన్వయంతో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జూన్ చివరి నాటికి ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన నడికూడ మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, నడికూడ తహసీల్దార్ రవీందర్ రెడ్డిని ఆదేశించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియను ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. జూన్ మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చే దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గాల్లోనూ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్లు వైవి గణేష్, మేన శ్రీను, పరకాల ఆర్డీవో డాక్టర్ కె నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎంలు పాల్గొన్నారు.

# ఆత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు

## కనీసం 50 ఎకరాలకు తగ్గకుండా ఉండేలా చర్యలు

## సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలను ఏర్పాటు చేయడానికి సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోశాలల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడమే కాకుండా, నిర్ణీత గడువులోగా నివేదిక రూపొందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో గోశాలల ఏర్పాటు, నిర్వహణ, సంరక్షణ, అభివృద్ధి వంటి అంశాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి శనివారం ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణ కోసం పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలు రూపొందించాలని చెప్పారు. గోసంరక్షణ, వాటి నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు జరగాలని, మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని చెప్పారు. గోశాలల ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బంధించినట్టుగా ఇరుకు స్థలాల్లో కాకుండా మేతకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండాలన్నారు. గోశాలల నిర్వహణ, సంరక్షణ విషయంలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించి పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ఖరారు చేయాలని చెప్పారు.



# సమగ్ర కార్యాచరణతో పుష్కరాలు సక్సెస్

- డే ఆఫ్ థాంక్స్ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు
- పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్, కలెక్టర్ రాహుల్, ఎస్పీ కిరణ్



అక్షరదర్బార్, భూపాలపల్లి క్రైమ్: ప్రభుత్వం ఆలోచన మాత్రమే చేస్తుందని ఆచరణలో పెట్టాల్సింది ప్రభుత్వ అధికారులేనని, మీలాంటి అధికారులు సమగ్ర కార్యాచరణతో నిర్విరామంగా కృషి చేయడం వల్ల సరస్వతి పుష్కరాలు విజయవంతం అయ్యాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన జరిగిన సరస్వతి పుష్కరాలు డే ఆఫ్ థాంక్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పుష్కరాలు ఘనంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన మేరకు జిల్లా యంత్రాంగం 12 రోజులు 24 గంటలు నిర్విరామంగా కష్ట పడ్డారని తెలిపారు. క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేస్తేనే అది అమలు అవుతుందని నిరూపించారని, పుష్కరాలు వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినట్లు తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సరస్వతి పుష్కరాల' నిర్వహణను ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకుని నిర్వహించినట్లు తెలిపారు. పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సుమారు 30 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శించుకున్నారంటే అందుకు కారణం మీరేనని, మీరు పడిన శ్రమ మీరు చూపిన చొరవ విజయానికి కారణం అయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ మార్గ నిర్దేశనంలో 33 శాఖలకు చెందిన అటెండర్ నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారి వరకూ ప్రతి ఒక్కరూ మూడు నెలలు చాలా కష్టపడ్డారని, పుష్కరాలను విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కాళేశ్వరానికి వెళ్లే జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో కాళేశ్వరం, ఇతర ప్రాంతాల్లో కొత్త బస్సు డిపోల నిర్మాణానికి శ్రీకారం చుడతామని అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ జిల్లా యంత్రంగా ఆశాంతం కష్టపడి పనిచేసి సరస్వతి పుష్కరాలను విజయవంతం చేసినట్లు తెలిపారు. ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ 12 రోజులు జిల్లా యంత్రాంగం మకాం వేసి ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పరిశీలిస్తూ పర్యవేక్షిస్తూ సమస్యలు పరిష్కరించి విజయవంతం చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యంత్రాంగమంతా ఒకతాటిపై నిలబడి అహర్నిశలు శ్రమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలు 12 రోజులు నిర్విరామ కృషిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ వరంగల్ ఆర్ ఎం విజయభాను, ఆర్డీఓ రవి, అదనపు ఎస్పీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో టాస్క్ ఫోర్స్ దాడులు

## నిషేధిత గుట్కా విలువ రూ .1,18,850



అక్షర దర్బార్, పరకాల : ఎటువంటి అనుమతి లేకుండా గుట్కా అక్రమ అమ్మకాల గురించి టాస్క్ ఫోర్స్ బృందం ఏసీపీ ఎ. మధుసూధన్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ బృందం నిషేధిత గుట్కా అమ్ముతున్న పరకాల పట్టణానికి పురెల్ల సత్యం (42) నుండి రూ.1,18,850 విలువ చేసే నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు.

# ఏసీపీని కలిసిన బీసీ రాజ్యాధికార సమితి సభ్యులు

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట ఏసీపీని శనివారం రాజ్యాధికార సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ రాజ్యాధికార సమితి వరంగల్ జిల్లా ఇన్చార్జి వంగ రవి ఆధ్వర్యంలో సమితి సభ్యులు నర్సంపేట నూతన ఏసీపీ పున్నం రవీందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో రాజశేఖర్, కొక్కు అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలి

### పరకాల ఆర్డీఓ, నడికూడ తహసీల్దార్ ను ఆదేశించిన కలెక్టర్



అక్షర దర్బార్, పరకాల : హనుమకొండ జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన నడికూడ మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, నడికూడ తహసీల్దార్ రవీందర్ రెడ్డి ని ఆదేశించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ను ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. జూన్ మూడో తేదీ నుండి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గాల్లోనూ నిర్వహించాలని ఆదేశించారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

### సీఐటీయు జిల్లా నాయకులు బొల్లం అశోక్

అక్షర దర్బార్,తొర్రూరు: జూన్ 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా నాయకులు బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. సీఐటీయు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శనివారం సీఐటీయు కార్యాలయం ముందు సీఐటీయు మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ అధ్యక్షతన జెండా ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీఐటీయు జిల్లా నాయకులు బొల్లం అశోక్ మాట్లాడుతూ... రోజు రోజుకు కార్మికుల పైన ఎన్నో నిర్బంధాలు వచ్చిన ఎదురొడ్డి పోరాడి నటువంటి సంఘమే సీఐటీయు అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయు మండల నాయకులు వెంకటేశ్వర్లు, యాకన్న, పాష, సురేష్, రవి, సైదులు, వెంకన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### ఆర్ ఐ శివరామకృష్ణ




అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మొగుళ్ళపల్లి రెవిన్యూ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ సూచించారు. మొగుళ్ళపల్లి మండలం కొరికి శాల గ్రామంలో శనివారం జరిగిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో వారు మాట్లాడారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలని, సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ శివ రామకృష్ణ ఏఎస్ఐ రాజేశం గ్రామకార్య దర్శి రాజాశేఖర్ గ్రామస్థులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి మెపా తెలంగాణ చేయూత

అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి మండలం రేఖంపల్లి గ్రామానికి చెందిన యాట రవి ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబానికి మెపా రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ చేతుల మీదుగా యాట రవి భార్య సుమలత, పిల్లలు రామ్ చరణ్, వర్షిత్ కు రూ.20వేలు శనివారం అందించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్ళ రవీందర్ ,దుగ్గొండి మండలం మెపా అధ్యక్షులు ఓరుగంటి తిరుపతిముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జెట్టబోయిన రాజేందర్ ముదిరాజ్ రేకంపల్లి ముదిరాజ్ కుల పెద్ద మనుషులు పొన్నం సాంబయ్య,తౌటి రవి, మెపా రాష్ట్ర కార్యదర్శులు సింగారం రామకృష్ణ దండు చిరంజీవి,మెపానాయకులు సంకెళ్ళ స్వామి, పొన్నం రాజు,బోల్ల శ్రీకాంత్, నీరటి మురళి,దండు బిక్షపతి,దండు శ్రీనివాస్, దండు రాజు, పొన్నం శ్రావణ్,నరేష్,శ్రీనివాస్,మెపా మండల ప్రచార కార్యదర్శి నీరటి మురళి ముదిరాజ్, కానుగుల సుధాకర్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, బాబు ముదిరాజ్, చింతకాయల అనిల్ ముదిరాజ్, రాజేష్ ముదిరాజ్ , బొమ్మరబోయిన వెంకటేష్ ముదిరాజ్,నీరటి నరసింహస్వామి ముదిరాజ్, తౌటి నరసింహ స్వామి ముదిరాజ్, కనుగుల ఐలయ్య ముదిరాజ్, యాట నరేష్ ముదిరాజ్, కొత్తూరు రాజు ముదిరాజ్ లతో పాటు రేకంపల్లి గ్రామ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## దుగ్గొండిలో విత్తన దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

అక్షర దర్బార్, దుగ్గొండి : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని విత్తన, ఫర్టిలైజర్ దుకాణాలపై జిల్లా వ్యవసాయ టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దుగ్గొండి మండల కేంద్రంలోని మన గ్రోమోర్, పరమేశ్వర, శ్రీ శివ, వెంకటేశ్వర షాపులో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టి స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, బిల్లు బుక్స్, అనుమతి పత్రాలు, రైతు వారి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టాస్కోఫర్స్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ అగ్రికల్చర్ అధికారి మాధవి ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.




## విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

### ఫర్టిలైజర్ షాపు యజమానులకు ఏవో యాదగిరి హెచ్చరిక

అక్షర దర్బార్, ఆత్మకూర్ : ఫర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు విత్తనాలను అధిక ధరలకు, అమ్మితే, కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి యాదగిరి హెచ్చరించారు. శనివారం ఆత్మకూరు మండలం ఆత్మకూరు, గూడపాడు గ్రామాలలోని ఫర్టిలైజర్ షాపులను అకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా ఏవో యాదగిరి మాట్లాడుతూ ఆధికృత ఉన్న ఫర్టిలైజర్ డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రసీదును పంట కాలము అయిపోయేంతవరకు భద్రంగా దాచుకోవాలన్నారు. గడువు దాటిన విత్తనాలను అమ్మకూడదని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు ఇవ్వాలని, సూచించారు. లైసెన్సులను, పలు రికార్డులను తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐ సంతోష్, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

## రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్లకు సన్మానం



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: పోలీస్ శాఖలో 36 ఏళ్లుగా సేవలందించి శనివారం పదవీ విరమణ పొందిన ఇద్దరు ఏఎస్సైలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరే ఘనంగా సత్కరించి, గృహపకరణాలు అందజేశారు. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పల్నాటి సాంబయ్య, ఘనపురం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న పోరిక రతన్ సింగ్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పి ఏ నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రత్నం, శ్రీకాంత్, కిరణ్, పోలీసు అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, విశ్రాంత ఏఎస్సైల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి అదనపు ఎస్పీగా నరేష్ కుమార్

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి అదనపు ఎస్పీగా ఏ. నరేష్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు శాఖలో 1991 సంవత్సరంలో ఎస్సైగా ఎంపికయిన అదనపు ఎస్పీ నరేష్ కుమార్, మొదట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్,రాయకల్ , కోరుట్ల, వేములవాడ, కరీంనగర్ రూరల్ లో ఎస్సైగా విధులు నిర్వహించి, 2006 లో సీఐగా పదోన్నతి పొంది, సీఐడి వరంగల్, టేకులపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, జగిత్యాల, ఖానాపూర్ సీఐ గా విధులు నిర్వర్తిస్తూ, 2017 లో డిఎస్పీ గా పదోన్నతి పొంది, మహబూబాబాద్, మామునూర్ ఏసిపి గా విధులు నిర్వర్తిస్తూ, 2023 లో అదనపు ఎస్పిగా ప్రమోషన్ పొంది, ఖమ్మం పోలీసు కమిషనరేట్ లో అదనపు డీసీపీ అడ్మిన్ గా విధులు నిర్వర్తిస్తూ, భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ గా బదిలీపై రావడం జరిగింది. అదనపు ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన ఏ. నరేష్ కుమార్ జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మర్యాద పూర్వకంగా కలిశారు.



## బంగ్లాపల్లి సర్పంచ్ భర్త యువరాజ్ మృతి

### పరామర్శించిన మాజీ సర్పంచులు.



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండలం బంగ్లాపల్లి తాజా మాజీ సర్పంచ్ కరాబ్ రజిత భర్త యువరాజ్ అనారోగ్యంతో శనివారం హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్లో మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కరాబ్ యువరాజు చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి మృతి చెందాడు. ఖరాబ్ రజిత బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ గా ఎన్నికై గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు మూడు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు మొగుళ్ళపల్లి టౌన్ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్ గణేష్ పల్లి తాజా మాజీ సర్పంచ్ తిప్పారపు యుగంధర్ మెట్టిపల్లి సర్పంచ్ ఏకాంబర సుగుణ రామారావు పరామర్శించారు.

## జిలుగు విత్తనాలు అందుబాటులో ఉంచాలి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జిలుగు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని మొగుళ్ళపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగరావు అధికారులను కోరారు. మొగుళ్ళపల్లి మండలానికి 250 క్వింటాళ్ల జిలుగు విత్తనాలు కేటాయించాల్సి ఉండగా ఈ సీజన్లో మండలానికి 150 కింటాలు రావడంతో రైతులకు తాత్కాలికంగా కొరత ఏర్పడిందన్నారు.

## మహిళా శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



అక్షర దర్బార్, పరకాల : దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శనివారం పరిశీలించారు. అనంతరం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ల్యాదళ్లలో సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల రూరల్ , టౌన్ మహిళలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ప్రతి ఇంట్లో ఒకరికి ఉపాధి అవకాశాలు పొందుతారని, త్వరలో దామెర మండల కేంద్రంలో డెయిరీ సెంటర్ ను కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం వంటిప్ప తండ గ్రామానికి చెందిన బానోతు తిరోజ (35) శుక్రవారం సాయంత్రం కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చిట్యాల ఎస్సై శ్రవణ్ కుమార్ వివరాల ప్రకారం.. ఈనెల 28న బానోతు తిరోజ తమ్ముడు తిరుపతి వివాహానికి ఆమె తన భర్త రవితో కలిసి హాజరైంది. ఈ క్రమంలో ఘర్షణ జరగగా ఈనెల 30న గ్రామానికి తిరిగి వచ్చిన తిరోజ ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఎంజీఎంకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపారు.

## పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

### ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ కుమార్ నాయక్



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని భూపాలపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కోర్టు ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పొగాకు వాడటం వలన కాన్సర్ బారిన పడుతారని, మెదడు, గుండె మరియు ఊపిరితిత్తులకు చాలా ప్రమాదం అన్నారు.

## స్నేహభావానికి క్రీడలు దోహదం

### బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మె ల్యే జీఎస్సార్



అక్షర దర్బార్ చిట్యాల : క్రీడలు మనుషుల మధ్య స్నేహభావాన్ని, ప్రేమానురాగాలను పెంపొందిస్తాయని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జయ శంకర్ భూపాలపల్లి జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కాకుండా మనిషికి, మనిషికి మధ్య ప్రేమానురాగాలు పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుట్ల తిరుపతి, రాం నరసింహారెడ్డి ఉన్నారు.